సాక్షి
గుంటూరు
గురువారం । 28 । డిసెంబర్ । 2023




శ్రీవారికి గరుడ వాహన సేవ

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని రైల్వేస్టేషన్‌రోడ్‌లోని అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామికి బుధవారం విశేష పూజలు చేసి, గరుడ వాహన సేవ నిర్వహించారు.



హుండీల ఆదాయం రూ. 11,54,240

తాడేపల్లిరూరల్ : కంఠంరాజు కొండూరులో మహంకాళి అమ్మవారి హుండీలను లెక్కించగా రూ. 11,54,240 ఆదాయం వచ్చిందని కార్యనిర్వణాధికారి వెంకటరెడ్డి తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 522.90 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

నంది నాటకోత్సవాలకు విశేష ఆదరణ



పాత గుంటూరు : కళా రంగాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలను ప్రేక్షకులు విశేషంగా ఆదరిస్తున్నారని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నాటకోత్సవాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొత్త పరిమళం సాంఘిక నాటికను ప్రదర్శించిన కళాకారుల బృందానికి రూ. 25 వేల పారితోషికాన్ని అందించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. చంద్రశేఖరరావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు మెడికల్ : ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) / కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ జి.శోభారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ఉమ్మడి మూడు జిల్లాల్లో 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు 2024 జనవరి 12వ తేదీలోగా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్హత, వేతనాలు, దరఖాస్తు ఫారం పూర్తి వివరాల కోసం హెచ్‌టీటీపీ:హెచ్ఎంఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

ఘనంగా శివ ముక్కోటి



అమరావతి : శివ ముక్కోటిని బుధవారం పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతిలో ఘనంగా నిర్వహించారు. బాలచాముండికా సమేత అమరేశ్వరునికి వేకువ జామున వేద పండితులు సంకల్పం, విఘ్నేశ్వరపూజ, మండపారాధన, మహాన్యాసం నిర్వహించారు. అనంతరం ఏకాదశ రుద్ర అన్నాభిషేకాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత పంచామృతాలతో, ఆ తర్వాత దాతల సహకారంతో సుమారు రెండు క్వింటాళ్ళ బియ్యాన్ని అన్నంగా వండి స్వామి వారికి అభిషేకం చేశారు. బాలచాముండేశ్వరి అమ్మ వారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించిన అనంతరం అభిషేకించిన అన్నంతో ఆలయ ఈవో వేమూరి గోపీనాథశర్మ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పెదకాకాని శివాలయంలో..

పెదకాకాని: శివాలయంలో మల్లేశ్వరస్వామివారికి అర్చకులు మహన్యాసక పూర్వక మహరుద్రాభిషేకం, 180 కిలోల అన్నంతో అన్న సూక్త పూర్వక అన్నాభిషేకం నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణ జరిగింది. అన్నాభిషేకం అనంతరం భక్తులకు స్వామి వారి దివ్య ప్రసాదంగా పంపిణీ చేశారు.

మల్లికార్జున స్వామికి విశేష అభిషేకాలు



గుంటూరు ఎడ్యుకేషన్ : మల్లికార్జునపేటలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఆరుద్ర నక్షత్రం, శివముక్కోటిని పురస్కరించుకుని బుధవారం స్వామివారికి విశేష అభిషేకాలను నిర్వహించారు. రుద్రహోమంతో పాటు విశేష స్వామివారికి అలంకారం చేశారు.

జెడ్పీ పద్దుకు గ్రీన్ సిగ్నల్

- 2024-2025 రూ.869 కోట్లతో జెడ్పీ వార్షిక బడ్జెట్
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.836 కోట్లతో సవరణ బడ్జెట్
- పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల బడ్జెట్‌తో కలిపి ఆమోదం
- ప్రజా సంక్షేమమే లక్ష్యం : జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా



ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, చిత్రంలో గుంటూరు, బాపట్ల కలెక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, రంజిత్‌బాషా, పల్నాడు జేసీ శ్యాంప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం తెలిపింది. గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్‌తో పాటు వచ్చే ఆర్థిక సంవత్సర అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్‌అండ్‌ఎస్ శాఖలను కలుపుకుని 2023-24 ఆర్థిక సంవత్సరానికి సవరణలతో కూడిన వార్షిక బడ్జెట్ రూ.836,76,78,407లుగా ఖరారు చేసి ఆమోదించారు. అదే విధంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.869,01,53,000తో అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. అదే విధంగా పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్‌అండ్‌ఎస్ శాఖలను మినహాయించి ప్రత్యేకంగా జెడ్పీకి వచ్చే ఆదాయ, వ్యయాలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను రూ.76.12 కోట్లతో, వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.87.97 కోట్లతో అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ సందర్భంగా క్రిస్టినా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజా సంక్షేమమే పరమావధిగా జెడ్పీ పరిపాలన సాగిస్తున్నట్లు తెలిపారు. కారుణ్య నియామకాల ద్వారా 70 మందికి ఉద్యోగాలతో పాటు 78 మంది ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించినట్లు చెప్పారు. ప్రాధాన్యక్రమంలో 495 అభివృద్ధి పనులకు రూ.25 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇసుక సీనరేజీ, మినరల్ సెస్, స్టాంప్‌డ్యూటీ సర్ చార్జ్, అద్దెలు, లీజు బకాయిల రూపంలో రూ.70 కోట్ల మేర రావాల్సి ఉన్నాయని తెలిపారు. కోవిడ్ వైరస్ జేఎస్-1ను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖాధికారులను ఆదేశించారు.

ముఖ్యాంశాలు

- ఇతర శాఖలను మినహాయిస్తే 2023-24 సంవత్సరానికి ఒక్క ఉమ్మడి గుంటూరు జెడ్పీ రాబడులు, ఆదాయాలను పరిగణనలోకి తీసుకుని రూ.61.26 కోట్లతో బడ్జెట్‌ను రూపొందించారు. వ్యయం, ఖర్చుల కింద రూ.60.85 కోట్లుగా చూపారు. సవరణ అనంతరం రూ.76.12 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. వ్యయం, ఖర్చులను రూ.75.61 కోట్లుగా చూపారు. రూ.51.33 లక్షలతో మిగులు బడ్టెట్‌గా ఖరారు చేశారు.
- 2024-24 వార్షికానికి బడ్జెట్‌లో రాబడులు, ఆదాయాలను రూ.87.97 కోట్లుగాను, వ్యయం, ఖర్చులను రూ.87.42 కోట్లుగా అంచనా వేశారు. మిగులు రూ.55.01 లక్షలుగా చూపారు.
- జెడ్పీకి ఆదాయ వనరులుగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి స్టాంప్ డ్యూటీ సర్ చార్జ్, నాలుగు శాతం తలసరి ఆదాయం, ఇసుక, మినరల్ సీనరేజీ, క్వారీ, భూముల లీజు, రేవుల ద్వారా వచ్చే ఆదాయం, భవనాలు, దుకాణాల అద్దెలు, ఇతర ఆదాయ వనరుల నుంచి రూ.26,72,60,000 వస్తాయని అంచనా వేశారు. వీటితోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ గ్రాంట్ల రూపంలో రూ.45 కోట్లు రావచ్చని లెక్కగట్టారు.
- వరికపూడిశెల కలనెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు సమావేశంలో పాల్గొన్న పల్నాడు ప్రాంత జెడ్పీటీసీలు కృతజ్ఞతలు తెలిపారు.
- డ్వాక్రా సంఘంలో ఉన్న సభ్యులకు తెలియకుండా రుణాలను తీసుకుని స్వాహా చేసిన ఘటనపై చర్యలు తీసుకోవాలని పలువురు జెడ్పీటీసీ సభ్యులు లేవనెత్తిన అంశాలపై విచారణ పూర్తయిందని, బాధ్యులపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నామని డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్ చెప్పారు.
- జెడ్పీటీసీల విజ్ఞాన యాత్రకు జెడ్పీ నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించారు.
- తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారాన్ని ఇచ్చే విషయమై తీసుకున్న చర్యలపై ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు లేవనెత్తిన అంశంపై వ్యవసాయశాఖాధికారులు సమాధానమిస్తూ, పంట నష్టం అంచనా పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నట్లు తెలిపారు.
- వరికపూడిశెల నిర్మాణంతోపాటు గుంటూరు చానల్ విస్తరణ చేపడుతున్నందుకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. వరికపూడిశెల నిర్మాణ పనులను మెగా ఇంజినీరింగ్ కంపెనీకి అప్పగించినట్లు ఇరిగేషన్‌శాఖాధికారులు చెప్పారు. సమావేశంలో గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి బాపట్ల కలెక్టర్ రంజిత్ బాషా, పల్నాడు జేసీ శ్యాంప్రసాద్ వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి తదితరులు జెడ్పీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో ఆవిష్కరించిన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పుస్తకాలు

బడ్జెట్ స్వరూపం ఇలా..

ఆర్థిక సంవత్సరం	2023-2024	2024-2025
రాబడులు, ఆదాయాలు	836,76,78,407	869,01,53,000
వ్యయాలు, ఖర్చులు	811,50,58,340	828,83,42,000
మిగులు బడ్జెట్	25,26,20,067	40,18,11,000

సమగ్ర ప్రతిపాదనలతో..

జెడ్పీ ఆదాయ, వ్యయాలకు సంబంధించిన బడ్జెట్‌ను ప్రభుత్వానికి పంపాల్సి ఉండటంతో బుధవారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో దీనిని ప్రవేశపెట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ పథకాలు, గ్రాంట్ల రూపంలో నిధులు పొందేందుకు అవాంతరాలు ఎదురుకాకుండా సకాలంలో బడ్జెట్ ప్రతిపాదనలను పంపేందుకు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన సమగ్ర ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా నవంబర్‌లో జరిగిన స్థాయీ సంఘ సమావేశంలో ఆమోదించిన బడ్జెట్ ప్రతిపాదనలను సమావేశంలో ప్రవేశపెట్టి, ఏకగ్రీవంగా ఆమోదించారు. బడ్జెట్ ప్రతిపాదనలపై సభ్యుల నుంచి ఎటువంటి వ్యతిరేకత వ్యక్తం కాలేదు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా-పారిశుధ్య విభాగ (ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్) శాఖల వారీగా ఆదాయ, వ్యయాలను జెడ్పీ బడ్జెట్‌తోపాటు ఆమోదించాల్సి ఉన్న దృష్ట్యా, పూర్తి పారదర్శక విధానంలో ఆయా శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలను కూడా చేర్చి జెడ్పీ వార్షిక బడ్టెట్‌తోపాటుగా ఏకగ్రీవంగా ఆమోదించారు.

జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అధిక మార్కుల సాధించాలనే లక్ష్యంతో జెడ్పీ నిధులతో రూపొందించిన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, టి.కల్పలతారెడ్డి, పల్నాడు, బాపట్ల జేసీలు శ్యాంప్రసాద్, శ్రీధర్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ, సీఈవో జె.మోహన్‌రావు ఆవిష్కరించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా సబ్జెక్టు నిపుణులతో రూపొందించిన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను రూ.77 లక్షల జెడ్పీ నిధులతో ముద్రించి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. గతేడాది రాష్ట్రంలోనే తొలిసారిగా రూ.61.80 లక్షల వ్యయంతో 36,155 మంది విద్యార్థులకు పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్ అత్యుత్తమ ఫలితాల సాధనకు దోహదం చేసిందని చెప్పారు. వరుసగా రెండో ఏడాది రూ.77 లక్షల నిధులతో 38,269 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సిద్ధం చేసినట్లు వివరించారు. స్టడీ మెటీరియల్‌ను పరిశీలించిన కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి జెడ్పీ పాలకవర్గాన్ని అభినందించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం అభినందనీయమని, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం పంపిణీకి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీఈవోలు పి.శైలజ, పీవీజే రామారావు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు పోటీపరీక్షల పుస్తకాలు

పంపిణీ చేసిన జాయింట్ కలెక్టర్ రాజకుమారి



పోటీపరీక్షల పుస్తకాలు

తెనాలి: గ్రూప్-1, గ్రూప్-2, గ్రామ/వార్డు సచివాలయం పరీక్షలతో సహా వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే యువత కోసం గ్రంథాలయాల్లో సంబంధిత పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. గుంటూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాయింట్ కలెక్టర్, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి జి.రాజకుమారి వివిధ గ్రంథాలయాలకు అవసరమైన పుస్తకాలను అందజేశారు. తెనాలి నెహ్రూ రోడ్డులోని శాఖా గ్రంథాలయం, రూరల్ మండలం పెదరావూరు, సంగంజాగర్లమూడి గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాలకు పోటీపరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందాయి. వీటిలో జాగ్రఫీ, భారత రాజకీయ వ్యవస్థ, జనరల్ నాలెడ్జి/ ఆంధ్రప్రదేశ్ స్పెషల్, భారతీయ సమాజం, ఇండియన్ పాలిటీ, భారతీయ సమాజం -సమస్యలు-సంక్షేమ విధానాలు, జనరల్ ఇంగ్లిష్, భారతదేశ చరిత్ర, సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకాలు ఉన్నాయి. నిరుద్యోగులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని, గ్రూప్-1, గ్రూప్-2కు ఇంకా అవసరమైన పుస్తకాలు ఉంటే గ్రంథాలయాల్లోని ఆన్ డిమాండ్ రిజిస్టరులో నమోదు చేసినట్టయితే తెప్పించగలమని జేసీ వివరించారు.

తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలి



విద్యార్థులకు బీడీఎస్ పట్టా ప్రదానం చేస్తున్న వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.బాబ్జి తదితరులు



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

- సేవాభావంతో దంత వైద్యరంగంలో రాణించాలి
- విద్యార్థులతో వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ బాబ్జి
- తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

పెదకాకాని : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేర్చాలని, ఉత్తమ దంత వైద్యులుగా జీవితంలో స్థిరపడాలని వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య డాక్టర్ కె.బాబ్జి చెప్పారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ కె.బాబ్జి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. డాక్టర్ కె.బాబ్జి మాట్లాడుతూ దంత వైద్యులు సేవాభావంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో సిబార్ దంత వైద్య కళాశాలకు మంచి పేరు ఉందన్నారు. సిబార్‌లో బీడీఎస్, ఎండీఎస్ చదివిన విద్యార్థులు దేశవిదేశాలలో స్థిరపడ్డారని గుర్తుచేశారు. కళాశాలలో నిరంతరం దంత వైద్యంపై పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. దేశంలోని పలు విశ్వవిద్యాలయాలతో ఎంఓయూల ద్వారా విదేశాలకు విద్యార్థులను ఎక్స్చేంజి ప్రోగ్రాం ద్వారా పంపిస్తున్నారని అన్నారు. కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు అన్ని రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం ఆయా సబ్జెక్టులలో ప్రథమస్థానం పొందిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎల్.సుబ్బారావు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్, ప్రిన్సిపల్ డాక్టర్ రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మన్నే ప్రకాష్, హెచ్ఓడి డాక్టర్ పి.రేవతి పాల్గొన్నారు.

శ్రీరామకోటి మహోత్సవాలు ప్రారంభం



సభలో మాట్లాడుతున్న సీతారామానుజాచార్యులు

పాత గుంటూరు: సంపత్ నగర్ శ్రీరామనామక్షేత్రంలో ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో 97వ శ్రీరామకోటి మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ధనకుదరం సీతారామానుజాచార్యులు పాల్గొని అంకురార్పణ, జ్యోతి ప్రతిష్ఠాపన, అఖండ జ్యోతి ప్రతిష్ఠాపన, శ్రీ రామ పతాకావిష్కరణ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాముల విశిష్టతను, రామాయణం ప్రత్యేకతను విశ్లేషణాత్మకంగా వివరించారు. సభలో కె.రామచంద్రప్రభు, బసవరాజు జయశంకర్ పాల్గొన్నారు. లీలాసుందరి మాట్లాడుతూ గురువారం ఉదయం సామూహిక తులసీదళార్చన ధ్వజారోహణ, సాయంత్రం శేష వాహనంపై శ్రీరామకోటి నగరోత్సవం, 29న శ్రీ సీతారామ కల్యాణం, రామాయణం, చిత్రలేఖనం, భక్తి పాటల పోటీలు, 30న నాగవల్లీదళార్చన, 31న శ్రీ రామ సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం, నగరోత్సవం, జనవరి 1న హోమం, పూర్ణాహుతి, 2న శ్రీసీతారాముల పవళింపు సేవతో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు.

నిబంధనల మేరకు ఓటర్ క్లెయిమ్‌ల పరిష్కారం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్ : జిల్లాలోని ఎస్ఎస్ఆర్-2024 డ్రాఫ్ట్ జాబితాకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలను, క్లెయిమ్‌లను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వచ్చేనెల 12లోపు పరిష్కరించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాప్రతినిధుల, అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఫామ్-7లో 1,075, ఫామ్-6లో 641 దరఖాస్తులు ఇంకా పపరిష్కరించాల్సి ఉందన్నారు. నిర్ణీత గడువులోపు వాటిని సక్రమంగా పరిష్కరించాలని చెప్పారు. సవరించిన నిబంధనల ప్రకారం వచ్చే ఏడాది జనవరి 22న ఫైనల్ పబ్లికేషన్ చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎ.అరవిందరావు, లక్ష్మీకుమారి, గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

31న బాస్కెట్ బాల్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : ది ఏపీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలో రాష్ట్ర బాలికల జట్టు ఎంపిక నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి కె.రాజేంద్ర ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన జట్టును ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 11 వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయ పోటీలకు పంపిస్తామన్నారు. వివరాలకు 94404 88118 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అతివేగానికి ఇద్దరు బలి

- చిలకలూరిపేట ఏఎంసీ వద్ద ప్రమాదం
- కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో ఇద్దరు ద్విచక్రవాహనదారులు మృతి
- మృతులిద్దరూ చిరువ్యాపారులే



కంభంపాటి కోటేశ్వరరావు మృతదేహం



దామిశెట్టి కిషోర్ (ఫైల్)



ప్రమాదానికి కారణమైన కారు



రెండు ముక్కలుగా విరిగిన స్కూటీ

నాదెండ్ల: కారు డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల రెండు నిండు ప్రాణాలు గాల్లో కలిశాయి. అతివేగంగా వస్తూ రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టడంతో చిరువ్యాపారులు మరణించారు. ఈ విషాద ఘటన బుధవారం ఉదయం 7.15 గంటల సమయంలో జాతీయ రహదారిపై చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదురుగా జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పర్చూరు మండలం యాడారుపల్లి గ్రామానికి చెందిన బిరుదు శ్యామ్‌రాజ్ తన కారులో గుంటూరు వెళ్లి తిరిగి బుధవారం ఉదయం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. అతివేగంగా కారు నడుపుతూ మార్కెట్ యార్డు వద్దకు వచ్చేసరికి ముందుగా వెళ్తున్న స్కూటీని బలంగా ఢీకొన్నాడు. దీంతో స్కూటీపై ఉన్న చిలకలూరిపేటకు చెందిన దామిశెట్టి కిషోర్ (43) సుమారు 25 అడుగుల దూరం ఎగిరిపడ్డాడు. స్కూటీ రెండు ముక్కలైంది. ఆ వెంటనే కారు టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొంది. అనంతరం పల్టీలు కొట్టింది. మోపెడ్‌పై ప్రయాణిస్తున్న గణపవరం అంబేడ్కర్ కాలనీకి చెందిన కంభంపాటి కోటేశ్వరరావు (57) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన కిషోర్‌ను 108 సాయంతో చిలకలూరిపేట ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతనూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ అశోక్, నాదెండ్ల ఎస్సై జె.బలరామ్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుడు కంభంపాటి కోటేశ్వరరావు కుమారుడు రాంబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

గోవులకు మేత వేసేందుకని వచ్చి..

చిలకలూరిపేట చౌత్రాసెంటర్‌లోని సాయి సెల్ ఫోన్ షాపు యజమాని దామిశెట్టి కిషోర్‌కు రోజూ ఎన్టీఆర్ కాలనీలోని గోశాలలోని గోవులకు కూరగాయలు, మేత అందించడం అలవాటు. యథావిధిగా బుధవారం కూడా ఆయన మార్కెట్‌యార్డులో హోల్‌సేల్‌గా కూరగాయలు తీసుకుని గోశాలకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. మృతుడు కిషోర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కూరగాయల కొనుగోలుకు వెళ్లి..

గణపవరం అంబేద్కర్ కాలనీకి చెందిన కంభంపాటి కోటేశ్వరరావు చర్చి ఎదురుగా చిల్లర దుకాణం నిర్వహిస్తుంటాడు. రోజూ ఉదయాన్నే మార్కెట్‌యార్డుకు వచ్చి తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై కూరగాయలు తీసుకెళ్లి అక్కడ స్థానికంగా విక్రయిస్తుంటాడు. రోజులాగే మార్కెట్‌లో కూరగాయలు తీసుకుని బండిపై పెట్టుకుని తిరుగు ప్రయాణమైన సమయంలో ప్రమాదానికి గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడటంతో వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లెల రాజేష్‌నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి వెళ్ళి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబాలను ఓదార్చారు. ఘటన జరిగిన తీరును తెలుసుకున్నారు. ఆయనతోపాటు నియోజకవర్గ బూత్ కన్వీనర్ విడదల గోపీనాథ్, నాయకులు ఉన్నారు.

యార్డుకు 60,206 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 60,206 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 57,829 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,300 నుంచి రూ.23,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 25,782 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

క్లుప్తంగా

క్రీడాకారులను వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్రా

- ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్
- ఉద్దండరాయునిపాలెంలో పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ నందిగం, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

తాడికొండ: మెరికల్లాంటి క్రీడాకారులను గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయికి అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. బుధవారం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో కొనసాగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ గతంలో క్రీడా సౌకర్యాలు లేక ప్రతిభ కలిగిన ఎందరో క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగలేకపోయారన్నారు. అందుకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేయడంతోపాటు, ప్రభుత్వం స్వయంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తూ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలను ప్రోత్సహించే ఏకైక ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. తాడికొండ మండలంలో కొనసాగుతున్న క్రీడా పోటీలను ఎంపీడీఓ అత్తోట దీప్తి పర్యవేక్షించగా, తుళ్లూరు మండలంలో క్రీడాకారులకు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకటశివారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆలోకం సురేష్ విజేతలకు బహుమతులు అందజేశారు.



ఉద్దండరాయునిపాలెంలో కబడ్డీ ఆడుతున్న యువకులు

గ్రామీణ క్రీడలు, కళలను ప్రోత్సహించాలి

- ఎమ్మెల్యేలు కిలారి వెంకటరోశయ్య, ముస్తఫా
- కొప్పురావూరులో జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు ప్రారంభం



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా

పెదకాకాని: పంటలు ఇంటికి చేరే వేళ రైతులు ఆనందంతో జరుపుకునే సంబరాల్లో ఎడ్ల పందేలు ప్రధానమైనవని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పెదకాకాని మండలంలోని కొప్పురావూరులో జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బండలాగుడు ప్రదర్శనను బుధవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫాతో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే కిలారి మాట్లాడుతూ రోజు రోజుకూ అంతరించి పోతున్న గ్రామీణ క్రీడలను, కళలను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. బండలాగుడు ప్రదర్శన నిర్వహిస్తున్న తోట శ్రీనివాసరావును అభినందించారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ బండలాగుడు బల ప్రదర్శనకు ఎడ్ల జతలతో వచ్చిన రైతులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. తొలుత పోటీలో ఉన్న ఎడ్ల జత యజమానిని సన్మానించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, గ్రామ సర్పంచి ఆలా సాంబశివరావు, గ్రామ పీఏసీఎస్ చైర్‌పర్సన్, ఎండ్ల పోటీల నిర్వాహకుడు తోట శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆరు రోజుల బండ లాగుడు ప్రదర్శనలు..

జాతీయస్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బండలాగుడు ప్రదర్శనలు బుధవారం నుంచి జనవరి ఒకటో తేదీ వరకూ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు తోట శ్రీనివాసరావు తెలిపారు. తొలి రోజు నాలుగు పళ్ళ విభాగలో 14 జతలు పాల్గొన్నట్లు చెప్పారు. విజేతలకు కేటగిరీల వారీగా రూ.6,000 నుంచి లక్షరూపాయల వరకూ అన్ని విభాగాల్లో 9వ జత వరకూ బహుమతులు అందజేస్తున్నట్లు వివరించారు.

5 నుంచి అంతర్జాతీయ తెలుగు మహాసభలు

ఇంకొల్లు (చినగంజాం): ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 2024 జనవరి 5,6,7 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహించే 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ బుధవారం ఇడుపులపాడులో నిర్వహించారు. వాల్‌పోస్టర్‌ను మడగాస్కర్ దేశంలో భారత రాయబారి బండారు విల్సన్ బాబు, కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ బండారు రత్నకిషోర్‌లు ఆవిష్కరించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ బాపట్ల జిల్లా సంచాలకులు పిడవర్తి పేరిరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషా వైభవాన్ని తెలుగు జాతి సంస్కృతి సంప్రదాయాన్ని ప్రపంచానికి చాటేవిధంగా మూడురోజులపాటు మహాసభలు జరుగుతాయన్నారు. గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ నిర్వహణలో ఆంధ్ర సారస్వత పరిషత్ ముఖ్య సంచాలకుడు కేసీ రాజు రామప్రసాద్ పర్యవేక్షణలో వివిధ సాహితీ ప్రక్రియలపై సదస్సులు, కవి సమ్మేళనం, కథా పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాలు వంటి అనేక కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. సుమారు 70 దేశాల నుంచి ప్రతినిధులు, లక్షమంది సాహితీ ప్రియులు పాల్గొంటారని, నాలుగు రాష్ట్రాల గవర్నర్‌లను, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను, మంత్రులను, పీఠాధిపతులను, సాహితీవేత్తలను ఆహ్వానించామని తెలిపారు. అంబటి సురేష్, కంభాలపాటి నరసయ్య పాల్గొన్నారు.

త్రికోటేశ్వరస్వామికి ఆరుద్రోత్సవం

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానంలో ఆరుద్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఆరుద్రోత్సవ పూజల్లో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి మహన్యాస పూర్వక మహారుద్రాభిషేకం వైభవంగా జరిపారు. మంగళవారం అర్ధ రాత్రి 12 గంటల నుంచి మహారుద్రాభిషేకం ప్రారంభమైంది. ముందుగా కోటయ్య మాలధారులకు జ్యోతిదర్శనం కల్పించారు. పాతకోటయ్య ఆలయం వద్ద నుంచి కనిపించిన జ్యోతిని మాలధారులు, భక్తులు దర్శించుకున్నారు. ఆవుపాలు, ఆవు నెయ్యి, ఆవు పెరుగు, తేనే, పంచాదార, సుగంధ ద్రవ్యాలు, విభూది, గంధం, కుంకుమ, తైలం, పండ్లు, ఎండు ఫలాలతో అభిషేకం జరిపారు. అనంతరం స్వామివారికి అన్నాభిషేకాన్ని అర్చకస్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజాము వరకు మహారుద్రాభిషేకం కొనసాగింది. తరువాత స్వామి వారికి విశేష అలంకరణలు చేశారు. మహారుద్రాభిషేకాన్ని తిలకించేందుకు భక్తులు బారులుతీరారు. తెల్లవారు వరకు వేచి ఉన్న భక్తులు అభిషేకాలను ఆసాంతం తిలకించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరుద్రోత్సవ పూజలకు ముందే స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన తాళ్ల వెంకటకోటిరెడ్డి, శీలం జయరామిరెడ్డి, అల్లు రమేష్‌లు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. బుధవారం ఉదయం ఆలయ యాగశాలలో రుద్ర హోమం నిర్వహించారు. పలువురు దంపతులు యాగంలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త రామకృష్ణ కొండలరావు, ఆలయ ఈఓ జి.శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలందరి చూపు జగనన్న వైపే

- పశ్చిమ నియోజకవర్గంలో ఉన్నది ఒకటే వర్గం... అది జగనన్న వర్గం
- వైఎస్సార్ సీపీకి బలమైన నియోజకవర్గం గుంటూరు వెస్ట్
- పార్టీ కార్యకర్తలపై ఎంతో నమ్మకం ఉంచి జగనన్న నన్ను పంపారు
- జనవరి ఒకటో తేదీన పార్టీ కార్యాలయం ప్రారంభం
- పార్టీ గెలుపు కోసం కష్టపడిన వారందరికీ గుర్తింపు వచ్చేలా చేసే బాధ్యత తీసుకుంటా
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, సమన్వయకర్త విడదల రజిని



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజిని, వేదికపై ఎమ్మెల్యే గిరి, లాలుపురం రాము

పట్నంబజారు: సంక్షేమాన్ని ప్రతి గడపకు చేర్చారు.. అభివృద్ధి అడుగులతో ఆంధ్రప్రదేశ్ ముందుకు తీసుకెళ్లారు.. కరోనా వంటి కష్టకాలంలో కుటుంబ సభ్యుడిలా ప్రతి ఒక్కరి బాధ్యతను తన భుజానికెత్తుకున్నారు.. పేదల ఆరోగ్యాన్ని కాపాడుతూ ఇంటి పెద్ద బిడ్డ అభయాన్నిచ్చారు.. ఎటువంటి ఆపద వచ్చినా తానున్నానే మనోధైర్యాన్ని కల్పించారు.. అందుకే ప్రజలంతా ముక్తకంఠంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి మరోసారి సీఎం కావాలని భావిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. విప్లవాత్మక నిర్ణయాలను తీసుకుని వాటిని అమలు చేస్తూ...గొప్ప పరిపాలన అందించిన జగనన్న వైపే ప్రజలంతా చూస్తున్నారన్నారు. గుంటూరు కొరిటిపాడు సాయిబాబారోడ్డు ఎదురుగా ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్‌లు, ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. మంత్రి రజిని మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పార్టీలో ఒకటే వర్గం ఉందని, అది జగనన్న వర్గం అని స్పష్టం చేశారు. పార్టీకి బలమైన నియోజకవర్గం గుంటూరు పశ్చిమమని, వచ్చే ఎన్నికల్లో ఈ విషయాన్ని కార్యకర్తలే నిరూపిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా కలిసి పనిచేసి పార్టీని గెలిపిస్తారనే నమ్మకంతో తనను జగనన్న ఈ నియోజకవర్గానికి పంపారని, కలసి మెలిసి పనిచేసి పార్టీని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యకర్తలు, నాయకుల్లో నమ్మకం, మనోధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించే బాధ్యత తనదని భరోసానిచ్చారు.

జనవరి ఒకటిన పార్టీ కార్యాలయం ప్రారంభం

గుంటూరు నగరంలోని కీలకమైన కొరిటెపాడు ప్రధానరోడ్డులో వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ప్రధాన కార్యాలయాన్ని నూతన సంవత్సరం రోజైన సోమవారం లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారందరికీ తగిన గుర్తింపు వచ్చేలా తాను చూస్తానని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికి అవకాశాలు దక్కేలా.. మంచి జరిగేలా చూసే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. గుంటూరు నగరంలో నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు.

భేదాభిప్రాయాలు లేకుండా పనిచేయాలి..

నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ మాట్లాడుతూ ఎవరికీ ఎవరిపై ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. ఓట్ల మార్పులు- చేర్పుల విషయంలో అవకతవకలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బలమైన నాయకత్వం పార్టీకి గుంటూరు వెస్ట్ నియోజకవర్గంలో ఉందని, ప్రతి ఒక్కరం ఐకమత్యంతో ముందుకు సాగుతూ.. రానున్న ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు రాతంశెట్టి సీతారామాంజినేయులు (లాలుపురం రాము), కార్పొరేటర్లు రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, మార్కెట్ బాబు, వంగల హేమలతారెడ్డి, పార్టీ నేత వంగల వలివీరారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ రథసారథి జగనన్నే స్ఫూర్తి

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ
- బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం కార్యక్రమానికి అనూహ్య స్పందన
- తక్కెళ్లపాడులో 1287 మందికి వైద్య పరీక్షలు



శిబిరానికి వచ్చిన తక్కెళ్లపాడు గ్రామస్తులతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: సంక్షేమ రథసారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం కార్యక్రమంలో భాగంగా బుధవారం తక్కెళ్లపాడులో ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేసిన నేత్రజ్యోతి కంటి పరీక్షలు, గుండె పరీక్షలు, ఫిజియోథెరపి సేవలను 1,287 మంది వినియోగించుకున్నారు. డాక్టర్లు పరీక్షల నిర్వహించి వీరిలో 26 మందికి యాంజియోగ్రామ్ చేయాలని నిర్ధారించారు. ఈ సందర్భంగా బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా బజరంగ్ జగన్నామ సంక్షేమ సంత్సరంలో కంటి సమస్యల పరిష్కారానికి నేత్రజ్యోతి ద్వారా ఉచిత నేత్ర వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఏడు పనిదినాల్లో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అలానే మీ గుండె పదిలం కార్యక్రమం ద్వారా ఉచిత గుండె పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి యాంజియోగ్రామ్, స్టంట్స్, బైపాస్ సర్జరీలు చేయించడం జరుగుతుందని పేర్కొన్నారు. దివ్యాంగ దర్శిని కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, జైపూర్ కాళ్లు, వెస్టన్ కమోడ్‌లు అందజేయడం జరుగుతుందని తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక సమయం కేటాయించి కంటి వైద్య పరీక్షలు జరిపించారు. వృద్ధులను, మహిళలను, వికలాంగులను వైద్య శిబిరానికి ప్రత్యేక వాహనాల ద్వారా తీసుకువచ్చి పరీక్షలు నిర్వహించి అదే వాహనంలో ఇంటికి తీసుకు వెళ్లడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

చైతన్యపూరితం.. నంది నాటకోత్సవం

- విశేష ప్రేక్షకాదరణ పొందుతున్న నాటక, నాటిక ప్రదర్శనలు
- ఐదో రోజు ఏడు ప్రదర్శనలు

పాత గుంటూరు: రాష్ట్ర ప్రభుత్వం నాటక రంగం వంటి మహత్తర కళలను కాపాడటానికి చలనచిత్ర, టి.వి. నాటక రంగ అభివృద్ధి సంస్థ ద్వారా నిరంతరం కృషి చేస్తోంది. దీనిలో భాగంగానే గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నంది నాటకోత్సవాలను అత్యంత వైభవంగా నాటక, నాటిక పోటీలు నిర్వహిస్తోంది. ప్రదర్శనలకు విశేషమైన ప్రేక్షకాదరణ లభిస్తోంది. మనిషి జీవితమే ఓ నాటకం. ఆనందం, దుఃఖం, కుటుంబ వ్యవస్థలో వచ్చిన మార్పులు, ప్రపంచంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, అనేక అంశాలు ఆధారంగా నాటిక, నాటకలు ప్రదర్శించారు. బుధవారానికి ఐదో రోజుకు చేరాయి. కళాకారులు ఏడు ప్రదర్శనలు ఇచ్చారు.

విజ్ఞాన భారతం సాంఘిక నాటకం..

డాక్టర్ రామన్ ఫౌండేషన్, సాయిబాబా నాట్యమండలి విజయవాడ వారి ప్రదర్శన ఇది. ప్రపంచానికి ఆధ్యాత్మిక గురువు భారతదేశం. భారత భాగవత, రామాయణాలు మన జాతి చరిత్రల మూలాధారాలు మన దేశంలో అసలు దేవుని ఉనికినే ప్రశ్నించే భౌతిక వాదులు తయారై మన చరిత్రను పక్కనపెట్టి వి/్ఞనాన్ని పుక్కిటి పురాణాలుగా కొట్టి పారేస్తున్నారనే విషయాన్ని ఎంతో సూటిగా, చూపరులకు భారత జాతి ఔన్నత్యాన్ని తెలయ పరచే దిగా ఈ నాటకం ఉంది. నాటి విజ్ఞానాన్ని నేటి తరానికి తెలియజేసి నాటి చారిత్రక సత్యాలను శాస్త్రీయంగా నిరూపించడమనే లక్ష్యాన్ని ఈ నాటకం చేరుకోగలిగింది. రచన, దర్శకత్వం డాక్టర్ పీవీఎస్ కృష్ణ వహించారు.

'అతీతం' (నాటిక)

అభినయ ఆర్ట్స్ గుంటూరు వారు అతీతం నాటిక ప్రదర్శించారు. శ్రీరామచంద్రమౌళి కథకు నాటకీకరణను శిష్టా చంద్రశేఖర్ దర్శకత్వాన్ని ఎస్.రవీంద్రరెడ్డి సమర్థంగా అందించారు. వింత జబ్బులా తయారైన ప్రపంచీకరణను, దాని ఫలితాలను విశ్లేషించిదీ నాటిక. దగాపూరిత ప్రపంచీకరణ భూతానికి ఎదురుతిరిగి ఈ తరం యువతరం అసలైన ప్రపంచీకరణకు అర్థం చెప్పి ఈ దేశాన్ని , సమాజాన్ని, చిద్రమైపోతున్న మన భారతీయ కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలని సందేశమిచ్చిన నాటిక ఇది.

'కపిరాజు'..

అన్నదమ్ముల ఆదర్శ గుణాలను చూపించిన ఈ నాటికను న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గుంటూరు వారు ప్రదర్శించారు. డాక్టర్ ఎంఎస్ చౌదరి రచనకు పి. దివాకర్ ఫణీంద్ర దర్శకత్వం వహించారు. రామాయణ మహాభారత కథల్లో అన్నదమ్ముల కథలే ప్రసిద్ధాలు. రామాయణలో రామలక్ష్మణులు రావణ విభీషణులు వాలి సుగ్రీవులు కనిపిస్తారు. రావణ విభీషణ మధ్య అహంకారం చిచ్చు పెట్టింది, వాలి సుగ్రీవుల మధ్య అధికారం చిచ్చు పెట్టింది. కానీ ధర్మం అహంకారాన్ని, అధికారాన్ని వదిలి పెట్టిన రామలక్ష్మణులను భగవంతులుగా నిలబెట్టిందనీ, అహంకారం అపార్థం ఎంతటి పతనానికైనా దారితీస్తాయని రుజువు చేసింది ఈ నాటిక.



అతీతం సాంఘిక నాటికలోని దృశ్యం

నేటి నాటక ప్రదర్శనలు ఇవే..

1. ఉదయం 9:30 గంటల నుంచి హైదరాబాద్ నవ క్రాంతి కల్చరల్ అసోసియేషన్ నిర్వహణలో జీవీజీ కృష్ణమూర్తి రచనకు అర్జునరావు దర్శకత్వంలో నర్తనశాల పద్య నాటకం.
2. మధ్యాహ్నం 12:30 గంటల నుంచి విజయవాడ యంగ్ థియేటర్ నిర్వహణలో ఆకురాతి భాస్కర్ చంద్ర రచనకు, వాసు దర్శకత్వంలో మూడు ప్రశ్నలు బాలనాటిక.
3. మధ్యాహ్నం రెండు గంటల నుంచి గుంటూరు అభినయ ఆర్ట్స్ నిర్వహణలో శ్రీ స్నిగ్ధ రచనకు, ఎస్.రవీంద్రారెడ్డి దర్శకత్వంలో ఇంద్రప్రస్థం సాంఘిక నాటిక
4. సాయంత్రం 4:30 గంటల నుంచి తెనాలి ప్రఖ్య చిల్డ్రన్స్ ఆర్ట్ థియేటర్ నిర్వహణలో తేజస్వి ప్రఖ్య రచనకు ఏ లక్ష్మణ శాస్త్రి దర్శకత్వంలో మహాభినిష్క్రమణ కళాశాల విద్యార్థుల నాటిక.
5. సాయంత్రం 6 గంటల నుంచి కొప్పోలు పండు క్రియేషన్స్ నిర్వహణలో గోవిందరాజుల నాగేశ్వరావు రచనకు, బాలినేని నాగేశ్వరావు దర్శకత్వంలో పక్కింటి మొగుడు సాంఘిక నాటిక.
6. రాత్రి 7:30 గంటల నుంచి హైదరాబాద్ శ్రీ కళానికేతన్ నిర్వహణలో టి.రామచంద్రరావు రచనకు డాక్టర్ మారం రాజు రామచంద్రరావు దర్శకత్వంలో వసంతరాజీయం పద్య నాటకం.

కొత్తపరిమళం నాటిక..

అది ఇండియా- పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతం.. జాతి, మత ద్వేషాలతో దేశాలు నలిగిపోయిన సరిహద్దు జీవిత గాథే కొత్త పరిమళం నాటిక.. జాతి, మత, ద్వేషాన్ని అంతం చేసే మానవత్వపు, విశ్వరూప, సౌందర్యం అనే కొత్త పరిమళంతో హద్దులు, సరిహద్దులు లేని అందమైన ప్రపంచాన్ని భావితరాలకుఅందాలనే లక్ష్యంతో ప్రదర్శితమైంది ఈనాటిక. కాండ్రేగుల శ్రీనివాసరావు మూల కథా రచనకు కె. కె. యల్. స్వామి నాటకీకరణను, బీఎంఎస్ పట్నాయక్ దర్శకత్వాన్ని సమకూర్చారు

ప్రపంచతంత్రం..



రెండో ప్రదర్శనగా బాలల నాటిక ప్రపంచతంత్రం ప్రదర్శితమైంది. దీన్ని న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజయవాడ వారు ప్రదర్శించారు. విన్నకోట రాజేశ్వరి రచనకు డాక్టర్ ఎంఎస్ చౌదరి దర్శకత్వం వహించారు. పంచతంత్ర కథలను విష్ణు శర్మ ఆనాడు యువరాజులకు జీవన విధానాన్ని బోధించటానికి చిన్నచిన్న కథలుగా రాశాడు. అవన్నీ ఈ నాటికీ ఎంతో ఉపయుక్తాలేననీ, ప్రపంచాన్ని అర్థం చేసుకోవటానికి, జీవన గమ్యాలు చేరడానికి బాగా ఉపకరిస్తాయని చెప్పిందీ ఈ నాటిక. ఎంతో ఆసక్తి కరంగా దర్శకత్వ మెలకువలను ప్రదర్శిస్తూ నాటిక ప్రేక్షకుల ముందుకొచ్చింది. బాలల నటన, వాచకం తదితరాలు బాగున్నాయి.

రాతిలో తేమ నాటిక..

పిన్నమనేని మృత్యుంజయరావు రచనకు ఆర్. వాసుదేవ రావు దర్శకత్వం వహించిన నాటిక ఇది. మానవత్వానికి, దానవత్వానికి మధ్య జరిగిన సంఘర్షణ ఇలా రాతిలో తేమ నాటికగా మారి మంచి సందేశమిచ్చింది. విజయవాడ యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ వారు ప్రదర్శించారు.

శ్రీకాంత కృష్ణమాచార్య..



13, 14 శతాబ్దాలకు చెందిన ఆదర్శయోగి శ్రీకాంత కృష్ణమాచార్యుల ఆదర్శవంతమైన జీవిత చరిత్రతో రూపొందించిన నాటకమిది. సింహాచలంలో వెలసిన శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి పరమభక్తుడు. అన్నమయ్య లాంటి సంకీర్తనాచార్యులకు, పోతన వంటి భాగవతోత్తములకు స్ఫూర్తినిచ్చిన వాగ్గేయకారుడు వారికంటే ప్రాచీనుడు కృష్ణమాచార్యులు జీవితాన్నే నాటకంగా మలచారు రచయిత మిరియాల లక్ష్మీపతి. దర్శకత్వం కె. వెంకటేశ్వర రావు వహించారు. విశాఖపట్నం జయ కళానికేతన్ వారు పద్యనాటకాన్ని ప్రదర్శించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ Single Sitting : 10th, 12th, BA, B.Com, B.Sc, MA, MCom, MSc, MBA, BBA, BCA BTECH, DIPLOMA, AGRICULTURE, PHARMACY, NURSING (for drop outs/ Backlogs) from UGC recognised Universities CALL : FCC: 1800-570-3344

REAL ESTATE

LAND FOR SALE

■ పల్నాడు జిల్లా-మాచర్ల SKBR కాలేజి వెనుక జగనన్న కాలని ఆనుకొని రెండు రోడ్లు ఫేసింగ్ గల 2ఎ॥ 8సెంట్లు రిజిస్ట్రేషన్ పొలం అమ్మబడును. సంప్రదించండి. 9848959150

PLOT FOR SALE

■ గుంటూరు సిటి పాత గుంటూరులో మానూరివారివీధిలో 67 గజముల స్థలం అమ్మబడును. ఫోన్ నెంబర్: 94900 20123

SERVICES

■ ఋణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార ఋణం, తక్కువ వడ్డీ, సిబిల్ అవసరం లేదు, NPA కూడా ధరఖాస్తు చేసుకోవచ్చు. సిటి కాపిటల్ సర్వీస్, విష్ణు,87690 57367.

BUSINESS OFFER

■ ప్రతిరోజు అద్భుతమైన ఆదాయం కొరకు. తక్కువపెట్టుబడితో మీపని/ఉద్యోగం/ వ్యాపారం చేసుకుంటూ కూడా ఈ బిజినెస్ చేయవచ్చు. పూర్తి సపోర్ట్ ఇవ్వబడును. ✆ 83175 28192

FOR SALE

■ Guntur లో 1800sft ఈస్ట్ ఫేస్, 4 ఫ్లోర్ (5) ఇన్నర్‌రింగ్ రోడ్, పవర్ ప్లే స్పోర్ట్స్ వద్ద 68 లక్షలకు కలదు. ఫోన్ 7093401314.

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 945 945 3338

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

WANTED

■ హైదరాబాద్ బీరంగూడలోని ప్రముఖ కంపెనీ స్టాల్‌లో బజ్జీమసాల, ముంత మసాల తయారు చేయుటకు పర్మినెంట్‌గా పనిచేయువారు కావలెను.మంచిజీతం+వసతికలదు.✆7382710253

■ గుంటూరు, మంగళదాస్‌నగర్‌లోని సిమ్స్ కళాశాల లేడీస్ హాస్టల్, జెంట్స్ హాస్టల్స్ నందు పనిచేయుటకు M/F వార్డెన్స్ కావలెను.✆8341278777, 9000854464

■ గవర్నమెంట్ హాస్పిటల్ నందు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ తరుపున ఆరోగ్యశ్రీ విభాగంలో వర్క్ చేయుటకు డేటాఎంట్రీ ఆపరేటర్స్ కావలెను. కంప్యూటర్ జ్ఞానం & టైపింగ్ స్పీడ్ వారికి ప్రాధాన్యత. 8885050664, 9642365514

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926

■ శ్రీలక్ష్మి వెంకటేశ్వర మెడికల్స్ హోల్‌సేల్ షాపు గుంటూరు నందు అనుభవం గల డెలివరీబాయ్స్-3 (బైక్ తప్పనిసరి), ఆఫీస్‌బాయ్స్-2 వెంటనే కావలెను. వాట్సాప్/కాల్: 62817 60880

■ గుంటూరు, తెనాలి, రేపల్లె, చీరాల, చిలకలూరిపేట, నర్సరావుపేట, సత్తెనపల్లి బ్యాంకులలో వర్క్ చేయుటకు యువతి/ యువకులు కావలెను. Qul:7th-PG, Sal:18000 ఆపైన. 9030740757

■ గుంటూరు కొత్తపేటలోని హాస్పిటల్ నందు లేడి రిసెప్షనిస్ట్, లేడి ANM, GNM, నర్సింగ్ స్టాఫ్ మరియు 10th పాస్ అయిన వార్డ్‌బాయ్స్ కావలెను. సంప్ర: 93921 92213

■ గుంటూరు Matrix విద్యాసంస్థలో పనిచేయుటకు అనుభవం కలిగిన PRO's Lady Wardens, Tele Callers కావలెను. 9866115387, 6309655468

■ Flipkart నందు పనిచేయుటకు bike డెలివరీ Executives కావలెను. స్మార్ట్ ఫోన్, 2 వీలర్ తప్పనిసరి. Location: మంగళగిరి. 90108 30148

■ Wanted Male Administrative Officers. Qualification Any Degree/ B.Tech/ P.G, Age: 23 to 45, Must be Married. 5 years Experience in Education or Any other Sector. Salary upto: 35000/-. Place of work Guntur. Master Minds. Contact: 89784 80429

■ MNC Ltd. కంపెనీల్లో డేటాఎంట్రీ, టెలికాలర్స్, అకౌంటెంట్స్, రిసెప్షనిస్ట్, సూ॥వైజర్స్, ఆఫీస్ ఇన్‌చార్జ్, ఆఫీస్‌బాయ్స్. Q: 10th-PG, జీ:10-25వేలు. సంప్ర: 7993976590

■ వేజెండ్ల, నారాకోడూరు, వేట్లోలు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్, సూపర్‌వైజర్స్ కావలెను. జీ: 13000- 15000/- PF,ESI కలదు. 12గం॥ డ్యూటీ. 6302252056, 7288909727

■ సిటీ జంబో జిరాక్స్ 8/1 అరండల్‌పేట గుంటూరు నందు కంప్యూటర్ ఆపరేటర్స్ (స్త్రీ/పు)యువతీయువకులు కావలెను. గుంటూరు లోకల్ వారికి ప్రాదాన్యత. 9441065559

■ ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు మెయిల్ ఆర్ ఫీమేల్ కావలెను. క్వాలిఫికేషన్ టెన్త్ జీతం 13,500 నుంచి 25,000 వసతి సౌకర్యం కలదు. ఫోన్ నెంబరు: 8392005989

■ విశ్రాంత ఉద్యోగులకు శుభవార్త, గుంటూరు సిటిలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు 10thపాస్, 50సం॥లపై వయస్సువారు కావలెను. 9515980476, 8333055045

■ Wanted B.Pharmacy or D.Pharmacy Candidates to work in a pharmacy in guntur City. PCI Certificate Registration mandatory. Contact: 6300975241

■ భువనేశ్వరి కోల్డ్ స్టోరేజి నందు పనిచేయుటకు వాచ్‌మెన్(ఫ్యామిలీ) కావలెను. జీతం+వసతి, తాళ్లపూడి గ్రా॥ చిలకలూరిపేట మ॥ NH ప్రక్కన పల్నాడు జిల్లా. 8019583888, 9491186590

■ రిసెప్షనిస్ట్స్, నర్సెస్, డ్యూటి డాక్టర్స్ కావలెను. అహల్యా నర్సింగ్ హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. 9246427459

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మెసేజ్‌లు పంపిస్తూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 7702518530, 8019341329.

■ డైరెక్ట్ జాయినింగ్ టుబాకో, ఫ్లాస్టిక్, సోప్స్, డ్రింక్స్, సిమెంటు, టెక్స్‌టైల్స్, ట్రాన్స్‌ఫార్మర్స్ కంపెనీలలో సూ.వై, స్టోర్ ఇన్‌చార్జిలు, ITI డిప్లమా, Ex.ఆర్మీ కావలెను. జీ: 18-32వేలు. PF, ESI ✆ 9703883479

■ గుంటూరు సిటీలో పనిచేయుటకు అనుభవం కలిగిన సెక్యూరిటీ గార్డ్స్ (Male) కావలెను. వయస్సు : 50 సం॥లు ఆసక్తిగలవారు సంప్ర : ✆ 80085 45666

■ ప్రముఖ హోమ్‌కేర్ సర్వీసెస్ హైదరాబాద్ లో వృద్ధులకు,పేషెంట్లకు సేవచేయుటకు, బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు కా॥. జీ: 17,000- 25000/-రూం+భో॥ఫ్రీ. ఫోన్: 9390343765

■ ప్రముఖ బ్యాంకు DSAల యందు కాంట్రాక్టు & జెల్ సోర్సింగ్ పద్ధతిలో వర్క్ చేయడానికి ఫీమేల్ స్టాఫ్ అ.కా. ను అ: ఇంటర్, డిగ్రీ జీ. 17k to 35k ఇంట్రెస్ట్ ఉన్నవారు వెంటనే డిటెయిల్స్ వాట్సప్ చేయండి. 7842295941.

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి+భోజనం జీ.18K.ఫోన్: 9640258899/9640468899.

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167649
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.